కథ

# నా గొడవ

ఆకెళ్ళ గిరిజ

## చెత్తకుండీ దగ్గర బైటపడ్డ 21వ శతాబ్దపు 'నిజం'

ఇదంతా నా ప్రజ్ఞ అనుకున్నాను.

నా తెలివి , నా మేథా సంపత్తి అనుకున్నాను.

నా చతురత, నా వ్యవహార దక్షత అనుకున్నాను.

చివరగా నా అదృష్టం, నా లక్ కలిసివచ్చి, నేనీ స్థితిలో ఉన్నానని నిశ్చయానికొచ్చాను.

నన్ను చూస్తే చాలా మందికి జలసీ ఆ అసూయవాళ్ళ చేతల్లోనే కనిపిస్తూ వుంటుంది!

ఇక మరికొందరికి ఆరాధన! క్రేజ్!

నా చుట్టూ తిరగాలనీ, నాతో పరిచయం కలిగించుకోవాలనీ, నాతో స్నేహం పెంచుకోవాలనీ... తద్వారా వాళ్ళు మరో మెట్టు పైకెక్కినట్టు ఫీలవడానికిపడే పాట్లు చూస్తుంటే. నాకు 'పాపం అమ్మో! అనిపించేది!

అలా నా లెవెల్లో నేను హాయిగా, హుందాగా, జాలీగా రోజులు వెళ్ళదీస్తున్నా...

అయితే కాల మహిమ!

రోజులన్నీ.. అందరికీ ఒక్కలా వుండవుకదా!


కాలం తెచ్చే మార్పులు అనూహ్యం!

నాకూ అలాగే జరిగింది! అకస్మాత్తుగా నా దశమారిపోయినట్టయింది. నా అదృష్టం తలక్రిందులైంది!

నా పరిస్థితి మారిపోయింది. ఒకనాడు హాయిగా,దర్జాగా కార్లో వెనకసీట్లో కూర్చుని ప్రయాణించేసే నేను రోడ్లమీద మండుటెండలో నడుస్తూ పోవాల్సి వస్తోంది!

సాయంకాలాలు అలా హుషారుగా, కార్లో. షికారుకెళ్లి చంద్రలేఖ దగ్గర ఆగే వాడిని. మస్తుగా, సుష్టుగా కావాల్సినవన్నీ తిని సగానికి సగం బాగాలేవని తోసేసి నా గొప్పతనం చాటుకునే రోజులవి.

అక్కడ్నుంచి విలాసంగా, లలిత ఇంటికో, లత వాళ్లింటికో వెళ్ళి ఆగేది నా కారు. అందమైన ఆడపిల్ల సాన్నిధ్యంలో సాయంత్రాలు గడపడంలో థ్రిల్ ని నేను ఆనందించినట్టు బహుశా ఎవరూ ఆనందించి వుండరు?



లతా వాళ్ళ డాబామీదో, లలితా వాళ్ళ లాన్స్‌లోనో కూర్చుని కుషీగా కబుర్లు చెప్పుకుంటూ... ఏ రాత్రికో ఇల్లు చేరడం!

ఎవరూ ఇంట్లో లేనప్పుడు అనేకసార్లు లత వడిలో తలపెట్టుకుని అనుభవించిన తన్మయత్వం ఎంతకాలమైనా, మరిచిపోయే అనుభూతికాదు. ఆమె సుతారమైన, సున్నితమైన వేళ్ళు నాజుట్టుతో ఆడుకునేవి. ఆ సమయంలో ఆమె కళ్ళు వర్షించే ప్రేమ, ఆరాధన, తన్మయత్వం.. ఒక జీవితానికి సరిపోవు.

హే! భగవాన్! అసలు మన్వంటూ వున్నావా?

వుంటే నన్నెందుకింద చిన్న చూపు చూశావు?

బతికిచెడ్డ వాడు బతకడం కష్టం అంటారు. బహుశా ఇందుకనేనేమో! బతుకు దామనుకునా గత బతకనీయకుండా అనుక్షణం గుర్తొస్తూ చిత్రవధ చేస్తూ ఉంటుంది. గతంలో జీవించలేక వర్తమానంతో రాజీపడలేక ఆ యాతన అనుభవించాల్సి వస్తుంది.

ఇలా ఎందుకు జరిగింది?

దీనికి నా బాధ్యత ఎంతవరకూ?

ఇంట్లో నాకెంత గుర్తింపు? ప్రతి విషయంలో నా పాత్ర కనపడేది. నా ప్రస్తావన వినపడేది. అలా ప్రతిదాన్ని డామినేట్ చేస్తూ వచ్చాను.

అమర్‌ది ఎంత గొప్ప మనసు?! నేనంటే ప్రాణం పెట్టేవాడు. నా విషయంలో ఏ మాత్రం తేడా జరిగినా సహించేవాడు కాదు. మిగతా వాళ్ళు కూడా నా విషయంలో అలాగే స్పందించేవాళ్ళు.

నేను వెళ్ళిపోతుంటే. ఆ రోజు అమర్ ముఖం నాకింకా గుర్తుంది. ఎలాగైనా సర్దిచెప్పి నన్ను ఆట్టే పెట్టాలని ప్రయత్నించాడు. కానీ ఆ డెవిల్ పద్మ పంతానికి లొంగిపోయాడు చివరకి. పెళ్ళాం మాట కాదని, మగాడు పాలసీ విషయాల్లో ఎన్నాళ్ళు నిభాయించుకురాగలడు?

అసలు నా గొడవంతా పద్మతోనే వచ్చి పడింది!

అనవసరంగా నన్నుమానించింది నా మీదలేనిపోనివన్నీ అమర్‌కు చెప్పి అతని మనసు విరిచేసింది!

అసలు ఆడవాళ్ళ మనస్తత్వమే అంత; ఇష్టమైతే నెత్తిన పెట్టుకోడం, లేకపోతే.. అవతలకి విసిరిపారెయ్యడం.. రెండూ ఎక్స్‌ట్రీమే!

అందుకే ఎంత తీపి అనుభవాల్ని నాలో పొందుపరుచుకున్నానో అంత చేదు అనుభవాల్ని కూడా నేను చవిచూడాల్సి వస్తోంది!

ఇంతకీ వీళ్ళని అనుకునేం లాభం!

అంతా నా దురదృష్టం!

ఈ మాయదారి జబ్బొచ్చి పడింది!

ఇదేం జబ్బో అంతుపట్టడం లేదు.

నాకు అంతుపట్టడమేమిటి నా మొహం.. నన్ను పరీక్షించిన డాక్టర్లకే అంతుపట్టలేదు.

ఒకళ్ళా! ఇద్దరా! ఎందరు డాక్టర్లు! ఎన్ని రకాల మందులు!

డాక్టర్ జగదీష్, ఫారిన్ రిటర్న్‌డ్ కూడా నాదగ్గర ప్రేక్షకుడే అయిపోయాడు!

కడకు నా ఖర్మ ఇలా కాలింది!

నిర్దాక్షిణ్యంగా గెంటేశారు!

నేను చేసిన సర్వీసుని కూడా మర్చిపోయారు! కనీస కృతజ్ఞత కూడా నాపట్ల చూపలేదు.

నాగరికత ఎంత పెరిగినా... మనిషిలోని.. రాక్షసుడు కూడా అంత ఇదిగానూ పెరుగుతూనే ఉన్నాడనుకోవల్సి వస్తోంది!

అబ్బా... ఆకలి...

తిండి మొహం చూసి ఎన్నాళ్ళయిందో??

రోజుకోరకం తిండి తినే నేను.. ఇష్టమైన వంటకాలు లేందే.. అలిగి కంచాన్ని తోసేసే నేను... ఈ రోజు ఆకలితో అల్లాడిపోతున్నా...

ఆకలి! ఆకలి!!

పేగులు లుంగజుట్టుకుపోతున్నాయ్ !

ఏం చేయడం? ఓపిక లేదు... అయినా తప్పదు... కడుపు నింపుకోవాలి. నెమ్మదిగా లేచాను, నీరసానికి కళ్ళు తిరుగుతున్నాయి. మెల్లిగా నడుచుకుంటూ మెయిన్ రోడ్డు ఎక్కాను.

ఎవరైనా నన్ను గుర్తు పడతారేమో! ఇదో పరువు తక్కువ! ఇప్పటి నా స్థితిని చూసి జాలిపడతారు! వాళ్ళ జాలి చూపుల్ని భరించడం ఇంకా కష్టం!

వాళ్ళ చూపుల్నుంచి తప్పించుకోవాలంటే. ఈ సందేగతి! సందులోకి మలుపుతిరిగాను.

ఆకలి అలాగే ప్రేగుల్ని కొరుకుతోంది.

అదుగో కుండీ!

చెత్తకుండీ! ఎంగిలాకులు పారేస్తున్నారు.

హమ్మయ్య! విస్తళ్ళనిండా... సగం సగం వదిలేసిన అన్నం, కూరలు... పదార్థాలు.. కనువిందుగా ఉన్నాయి.

ఒకప్పుడు నేను అన్నం పారేయడం గుర్తొచ్చింది. ఫర్వాలేదు. నాలాంటి వాళ్ళింకా ఉన్నారు దేశంలో... లేకపోతే ఇప్పుడు నాలాంటి వాళ్ళెలా బ్రతకాలి?

మెల్లగా కుండీని సమీపించాడు,

చుట్టూ చూశాను... ఎవరూ ఆ సందులో లేరు!

ఆ విస్తళ్ళని చూస్తుంటేనే నా కడుపు సగం నిండిపోయింది.

అంతలోనే సందులో అలికిడి!

అయ్యో! వీళ్ళెవరు? ఎక్కడ్నుంచి వచ్చారు? వెధవలు ఆదిమానవుల్లా ఉన్నారు!

"ఛీ... ఛీ... ఛీ" "భౌ... భౌ... భౌ...

"ఛీ... ఛీ..."

"భౌ... భౌ..."

ఆ వెధవ కర్ర వేశాడు... నా నెత్తిన బాదాడు... అమ్మో... చచ్చాన్రో దేవుతో... కుయ్యో... మొర్రో...

...ఛీ... ఎదవ కుక్క... దాని వాలకంచూడు... డోకువత్తా వుంది...."

వాళ్ళ మాటలు పరిగెడుతున్న నాకు అస్పష్టంగా వినిపించాయ్!

'అమ్మమ్మా ఎంతో చిత్రం! ఎంగిలిస్తరాకుల కోసం కుక్కల్తో పోటీపడే మనుషులున్న ఈ దేశంలో.. ఆళ్ళకంటా నా బతుకే నయమన్నమాట...' దర్జా, ధీమా నాలో పెరిగాయి. ●